సాక్షి
నిజామాబాద్
గురువారం। 17 । ఆగస్టు । 2023



కమీషన్ కొట్టెయ్

కమీషన్‌లే ధ్యేయంగా నగరంలోని ప్రైవేటు ఆస్పత్రులకు గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలు రోగులను రిఫర్ చేస్తున్నారు.
- 10లో ▸



'కోడిగుడ్ల మీద ఈకలు పీకే'..

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకుల మోసపూరిత మాటలు నమ్మొద్దని మంత్రి ప్రజలకు పిలుపు నిచ్చారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /23.3

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం చిరుజల్లులు కురియవచ్చు. సాయంత్రం మోస్తారు వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎన్నికల శిక్షణలో మున్సిపల్ కమిషనర్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరందు ఎన్నికల శిక్షణ నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. ఈ నెల 16 నుంచి 19వరకు నాలుగు రోజుల పాటు ఆయన శిక్షణలో ఉండనున్నారు. ఈ నెల 19న సోమవారం మున్సిపల్ కార్యలయానికి రానున్నారు.

మున్సిపాలిటీలో విజిలెన్స్ విచారణ

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపాలిటీలో విజిలెన్స్ విచారణ చేపట్టారు. శానిటేషన్ విభాగంలో ట్రేడ్‌లైసెన్సుకు సంబంధించి బుధవారం అధికారులు విచారణ చేశారు. 2019లో అక్రమంగా ట్రేడ్ లైసెన్సు ఇవ్వడంపై విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై ప్రస్తుతం విధుల్లో ఉన్న ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిత్‌అలీతో పాటు సానిటేషన్ ఎస్సై శ్రీకాంత్‌ను విచారించినట్లు తెలిపారు. అప్పట్లో విధులు నిర్వహించిన ఎంహెచ్‌వోను సైతం విచారణ చేయనున్నట్లు తెలిసింది. అలాగే టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఓ భవనం విషయంలో ఆరా తీసినట్లు తెలిసింది. విజిలెన్స్ అధికారులే వివరాలు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిసింది.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



సుభాష్ నగర్ : నగరంలోని రైల్వే స్టేషన్ లో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ప్రజల కల త్వరలో నెరవేరబోతుందని అన్నారు. కేంద్రం ముద్ఖేడ్ నుంచి నిజామాబాద్, మేడ్చల్, మహబూబ్ నగర్, కర్నూల్ వరకు డబుల్ లైన్ కోసం రూ.4884 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ యాదవ్, యెండల సుధాకర్, స్వామి యాదవ్, శ్రీనివాస్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగుల కోసం వీఆర్‌ఏల పడిగాపులు



నిజామాబాద్‌నాగారం: రెవెన్యూశాఖ నుంచి వీఆర్‌ఏలను మున్సిపాలిటీకి కేటాయించిన విషయం తెలిసిందే. ఈమేరకు సుమారు 62మంది నిజామాబాద్ మున్సిపాలిటీకి కేటాయించి వారం రోజులు అవుతుంది. దీంతో వీఆర్‌ఏలు నిత్యం పోస్టింగ్ కోసం ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో పడిగాపులు కాస్తున్నారు. ఆర్డర్ కాపీలు ఇదిగో.. అదిగో అంటు అధికారులు ఊరిస్తున్నారు. దీంతో వీఆర్‌ఏలు కార్యాలయానికి వస్తున్నారు.. పోతున్నారు. పడిగాపులు కాసిన పోస్టింగ్‌లు ఇవ్వకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో కూడా పోస్టింగ్‌లు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నట్లు వీఆర్‌ఏలు తెలిపారు. నగరంలో 60 డివిజన్‌లు ఉన్నాయి. డివిజన్ పరిధిలో చదువురాని వీఆర్‌ఏలనే గార్డెన్‌లకు నీళ్ల పట్టేలా, చదువుకున్నవారిని బిల్ కలెక్టర్, ఇతర విభాగాల్లో తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఏదీ ఏమైనా త్వరగా నిర్ణయం తీసుకోని పోస్టింగ్‌లు ఇవ్వలని వారు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని వయోవృద్ధుల సంరక్షణ, పోషణ, నిర్వహణ అమలు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని, ఇందుకోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ షేక్ రసుల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఈనెల 25లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. ముగ్గురు సభ్యులను ఎంపిక చేస్తామని, ఇందులో ఒక మహిళ తప్పనిసరిగా ఉండాలన్నారు. సీనియర్ సిటిజన్ సంక్షేమ రంగంలో సేవలందిస్తున్న ఎన్‌జీవోలు, నిపుణులు కార్యకర్తల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.



పిడికిలెత్తి విజయ చిహ్నం చూపిస్తున్న ఎమ్మెల్సీ కవిత

ప్రజలతో మాది పేగు బంధం



బోధన్‌లో బీఆర్‌ఎస్ బూత్ కమిటీల సమావేశానికి హాజరైన ప్రజలు, ఎన్నికల నగారా మోగిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్



బ్యాలెట్ పోరుకు సై..

- వారిది ఓటు బంధం
- బోధన్ నియోజకవర్గంలో సీనియారిటీ, సిన్సియారిటీకి మధ్య పోటీ
- బీఆర్‌ఎస్ బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత
- ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- ఎమ్మెల్యేగా షకీల్‌ను మూడోసారి గెలిపించాలని విజ్ఞప్తి

బోధన్/ బోధన్‌టౌన్ : తెలంగాణ ప్రజలతో బీఆర్ఎస్‌కు పేగుబంధం ఉంటే, వాళ్లకు ఓటు బంధముందని కాంగ్రెస్, బీజేపీపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శలు చేశారు. కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కుల, మతాలకతీతంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు.

బుధవారం బోధన్‌లోని ఎన్ఎస్ఎఫ్ మైదానంలో ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ నేతృత్వంలో బీఆర్ఎస్ నియోజక వర్గ స్థాయి బూత్‌కమిటీ సభ్యుల భారీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా కవిత హాజరయ్యారు. నగారా మోగించి ఎన్నికల ప్రచార క్యాంపెయిన్‌ను ఎమ్మెల్యే షకీల్‌తో కలిసి ప్రారంభించారు.కవిత మాట్లాడుతూ ఇంటింటికీ ధైర్యంగా వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని, ప్రతి గుండెను తట్టాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ప్రజలకు ఏమీ చేయని వారు అబద్ధాలతో ఎన్నికల ముందు కన్‌ఫ్యూజ్ చేసే ప్రయత్నాలు చేస్తారని ఆరోపించారు. ఇన్నాళ్లు మతాల పేరుతో ప్రజలను విడగొట్టారన్నారు. నిజామాబాద్‌లో ఐటీ హబ్ ప్రారంభించిన తొలి రోజే 250 మంది యువకులకు ఉద్యోగాలు లభించాయన్నారు.

ఈ నెల 29న మరో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని తెలిపారు. ప్రఖ్యాత కంపెనీలు మేళాకు వస్తున్నాయన్నారు.

ఎమ్మెల్యే షకీల్‌పై ప్రశంసలు

సౌమ్యుడు, ప్రజల కష్టాలు తెలిసిన ఎమ్మెల్యే షకీల్‌ను మూడోసారి మెజారిటీతో గెలిపించాలని కవిత అన్నారు. పట్టణ శివారు ఏఆర్‌గార్డెన్ నుంచి సమావేశ స్థలి వరకు కాలినడకన వస్తుంటే ఎమ్మెల్యే షకీల్ విజయోత్సవ యాత్ర నిర్వహించి నట్టుందని పేర్కొన్నారు. కాలినడన వస్తున్న క్రమంలో పలు చోట్ల ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నృత్యం చేశారు.

3 వేల కోట్లతో అభివృద్ధి : ఎమ్మెల్యే షకీల్

కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, జిల్లా మంత్రి ప్రశాంత్ రెడ్డి సహకారంతో తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో బోధన్ నియోజకవర్గంలో రూ. 3 వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే షకీల్ స్పష్టం చేశారు. వివిధ పథకాల ద్వారా రూ.1800 కోట్లు నేరుగా ప్రజల ఖాతాకు వెళ్లాయన్నారు. నియోజకవర్గానికి మూడు సార్లు ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి రూ.వేల కోట్లు సంపన్నుడైనా ఏ ఒక్కరికి ఏ సహాయం చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీకి వెళ్లిన మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వెళ్లిన మేడపాటి ప్రకాశ్ రెడ్డి ,కాంగ్రెస్ నాయకుడు కెప్టెన్ కరుణాకర్ రెడ్డిలు ఎన్నికల ముందు ప్రజలవద్దకు వస్తారని ఎద్దేవా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డిలు కలిసి వచ్చినా తాను ఎదురొడ్డి నిలిచి ఓడించానన్నారు. ఇలాంటి వ్యక్తులకు అవకాశం ఇవ్వొదన్నారు. కరోనా సమయంలో ప్రజల మధ్య ఉండి కష్టాల్లో పాలుపంచుకున్నాని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రతినిధి రాంకిషన్‌రావు, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్, ఏఎంసీ చైర్మన్ వీఆర్‌దేశాయ్, ఎంపీపీలు బుద్దె సావిత్రి, శ్రీనివాస్, జడ్పీటీసీలు లక్ష్మి గంగారెడ్డి, సవిత బుచ్చన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ సునీతాదేశాయ్, పార్టీ పట్టణ, మండలాల అధ్యక్షులు రవీంద్ర యాదవ్, సంజీవ్, నర్సన్న, దేరడి శ్రీరాం ,భూంరెడ్డి, నర్సింగ్‌రావు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీబూత్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు

62 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పేదలకు, మైనారిటీలకు చేసిన మేలు ఏమీ లేదని కవిత అన్నారు. తెలంగాణలో కేసీఆర్ రెండు దఫాలు మైనారిటీ నేతకు ఎమ్మెల్సీ పదవితో పాటు డిప్యూటీ సీఎం, హోంశాఖ మంత్రిగా పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలో పింఛన్ రూ.750 మించి ఇవ్వడం లేదని, తెలంగాణలో రూ. 4 వేల పింఛన్ ఇస్తామంటున్నారని విమర్శించారు. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఇరిగేషన్ శాఖమంత్రిగా ఉండి నియోజక వర్గంలోని ఏ ఒక్క చెరువును బాగు చేయలేదని, రాష్ట్రం వచ్చిన తర్వాత 152 చెరువులను బాగు చేసుకున్నామన్నారు. ఈ సారి బోధన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ పెద్ద వ్యాపారవేత్త అయిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, మరో వైపు ప్రజల కష్టాలు తెలిసిన బిడ్డ, సామాన్య కార్యకర్త ఎమ్మెల్యేషకీల్ మధ్య ఉండబోతుందన్నారు. బోధన్‌లో 10 వేలమంది బీడీ కార్మికులకు పింఛన్‌లు వచ్చాయన్నారు. పదేళ్ల కాలంలో 4 వేల 500 పట్టణ పొదుపు మహిళ సంఘాల సభ్యులకు రూ.2 వేల 600 కోట్ల రుణాలు అందాయన్నారు.



బోధన్‌లో కార్యకర్తలతో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్

కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


- రాష్ట్ర ఎన్నికల సంయుక్త అధికారి సర్ఫరాజ్



సుభాష్‌నగర్ : సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా కొత్త ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర ఎన్నికల సంయుక్త అధికారి సర్ఫరాజ్ సూచించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ పోస్టల్ శాఖ ద్వారా వెంటనే గుర్తింపు కార్డులు చేరేలా పర్యవేక్షించాలన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. సర్ఫరాజ్ మాట్లాడుతూ 18 – 19 ఏళ్లు కలిగిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 19న అన్ని సెగ్మెంట్ల పరిధిలో 5కె రన్ నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీ, ఆశాకార్యకర్తలు సహా అన్ని వర్గాల వారు భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. పోలింగ్‌లో పాల్గొనాల్సిన ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కోసం నియోజకవర్గాల్లో సంచార వాహనాలతోపాటు సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం చేయాలన్నారు. ఈనెల 21న గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఓటరు జాబితాను అందించాలని అన్నారు. దివ్యాంగులైన ఓటర్లను జాబితాలో ప్రత్యేకంగా మార్కింగ్ చేయాలని, వారికి అవసరమైన ర్యాంప్, వీల్ చైర్ వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచాలన్నారు. థర్డ్ జెండర్ల వివరాలు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయాల నుంచి సేకరించి, ఓటర్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు ఉన్నాయా అని పరిశీలించుకోవాలన్నారు. వారి సమ్మతి మేరకు జాబితాలో స్త్రీ, పురుష ఓటర్లుగా పేర్లు నమోదు చేయాలని సూచించారు. గత ఎన్నికలలో తక్కువ ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి కారణాలను పరిశీలించాలన్నారు. వీసీలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, డీసీవో సింహాచలం, ఎన్నికల సిబ్బంది సాత్విక్ పాల్గొన్నారు.

డబ్లింగ్‌కు గ్రీన్ సిగ్నల్..

- ముద్ఖేడ్ నుంచి డోన్ వరకు ..
- 417.88 కిలో మీటర్ల లైన్ ఏర్పాటు
- రూ.4686.09 కోట్లు కేటాయింపు
- కేంద్ర కేబినెట్ నిర్ణయం



ఖలీల్ వాడి : ముద్ఖేడ్ నుంచి డోన్‌కు డబ్లింగ్ లైన్ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాతో పాటు తెలంగాణలోని నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాలు, ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాతో పాటు డోన్ జంక్షన్ వరకు డబ్లింగ్ లైన్ ఏర్పాటు చేస్తారు.417.88 కిలోమీటర్లు డబ్లింగ్ లైన్ ఏర్పాటు చేయనున్నారు. కేంద్రం రూ. 4686.09 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద కేటాయించారు. ప్రస్తుతం మేడ్చల్ నుంచి ముద్ఖేడ్ వరకు సింగిల్ లైన్ ఉండటంతో రైళ్లు ఎక్కువ సంఖ్యలో రాక ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రయాణికులు నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో గంట కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి.

డబ్లింగ్ లైన్‌తో రైళ్ల రాకపోకలకు అంతరాయం తొలగడంతో పాటు అదనంగా రైళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ముద్ఖేడ్-మేడ్చల్ – మహబూబ్ నగర్–డోన్ సెక్షన్ డబ్లింగ్ ప్రాజెక్టు ఆమోదం తెలిపినట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు.

ఈ రైల్వేప్రాజెక్టులు పూర్తయితే కొత్త రైళ్లను ప్రవేశ పెట్టడం, అదనపు సరుకు రవాణాను సులభతరం అవుతుందని అరుణ్ జైన్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రాంతం సామాజిక, ఆర్థిక అభివృద్ధి జరుగుతుందన్నారు. ముద్ఖేడ్ – డోన్ విభాగం దేశంలోని ఉత్తర – పశ్చిమ భాగాన్ని దక్షిణ ప్రాంతంతో రైలు మార్గం కలుపుతుంది. సరుకు రవాణాతో పాటు ప్రయాణికుల పెరుగుదల క్రమంగా ఉంటుంది.

ప్రధాని, రైల్వే మంత్రికి ధన్యవాదాలు



ముద్ఖేడ్ నుంచి మేడ్చల్ డబ్లింగ్‌కి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ప్రధాన మంత్రి మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ధన్యవాదాలు. ముద్ఖేడ్ నుంచి బాసర వరకు భూమిని చదును చేస్తున్నారు. త్వరలో డబ్లింగ్ పనులు ప్రారంభమవుతాయి. నిజామాబాద్ నుంచి పుణే, ముంబాయి, షీర్డీ, బెంగళూర్‌కు కనెక్టివిటీ పెరుగుతుంది. ప్రయాణికులకు మూడు నుంచి నాలుగు గంటల సమయం కలిసి వస్తుంది.

– అర్వింద్, ఎంపీ

బీసీ గర్జనతో సత్తా చాటుదాం

- ఎంపీ నియోజకవర్గ పరిధిలో బీసీలకు మూడు ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వాలి
- వైఎస్‌హయాంలోనే ఉచిత విద్యుత్, రుణమాఫీ అమలయ్యాయి
- కేసీఆర్, చంద్రబాబునాయుడు స్కూల్ కాంగ్రెస్ పార్టీనే
- మాజీ రాజ్యసభసభ్యుడు వి హన్మంత్ రావు



బీసీ గర్జన సన్నాహక సభలో గద్దర్ మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఖలీల్ వాడి : ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీసీలకు కాంగ్రెస్ అధిష్టానం మూడు ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి హన్మంత్‌రావు కోరారు. బుధవారం జిల్లా కేంద్రం ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో జరిగిన బీసీ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సోనియాగాంధీ మూడు సార్లు ప్రధాన మంత్రి పదవి వచ్చినా తీసుకోలేదన్నారు. రాహుల్‌గాంధీ హాథ్ సే హాథ్ జోడో యాత్రను దేశవ్యాప్తంగా చేపట్టి బీసీ, ఎస్సీ, మైనారిటీ, ఎస్టీలకు పరిస్థితులను దగ్గర నుంచి చూశారన్నారు. కేసీఆర్ బీసీ బంధు పెడుతానని చెప్పి చేతులెత్తేశాడని, ఇప్పుడు రూ. లక్ష పేరిట మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టే బీసీ గర్జనను విజయంతం చేసి సత్తా చాటాలన్నారు. చట్టసభల్లో బీసీలు పెరిగితే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే ఉచిత విద్యుత్, రుణామాఫీ జరిగిందన్నారు. రైతు బంధుతో పెద్ద రైతులు, ఓసీ వర్గాలకు చెందిన వారే లాభం పొందుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణామాఫీ చేస్తామన్నారు. సమావేశంలో ప్రజాయుద్ధనౌక గద్దర్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు

దోచుకుంటున్నారు : మధుయాష్కీ

తెలంగాణ రాక ముందు సీఎంతో పాటు కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేల ఆస్తులు ఎంతో స్పష్టం చేయాలని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం, ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని ఆరోపించారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని, కేసీఆర్ బీసీలను మోసం చేస్తూ విభజించు పాలించు విధానం తీసుకువచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్‌లు కేటాయించే ప్రదేశ్ కమిటీలో ముగ్గురే బీసీలు ఉండగా, స్క్రీనింగ్ కమిటీలో ఎవరూ లేరని మాజీ విప్ ఈరవత్రి అనిల్ అన్నారు. దీంతో బీసీలకు పార్లమెంట్ పరిధిలో రెండు లేదా మూడు సీట్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఎన్నికలలో టిక్కెట్ రాకుంటే చంద్రబాబునాయుడు, వెంకయ్య నాయుడు ఇద్దరు టీడీపీ, బీజేపీలోకి రావాలని పిలిస్తే జన్మనిచ్చిన కాంగ్రెస్‌పార్టీని వీడి వెళ్లనని స్పష్టం చేసినట్లు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదగర్ గంగారాం తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్‌హందన్, మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత అగర్వాల్, రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జి భూపతిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గం ఇన్‌చార్జి కాసుల బాలరాజ్, బాడ్సిశేఖర్ గౌడ్, ముప్పగంగారెడ్డి, వేణుగోపాల్ యాదవ్, వేణు రాజ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, వివిధ మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, జిల్లాలోని బీసీ నాయకులు పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో లావణ్యను పరామర్శిస్తున్న వి హన్మంత్‌రావు తదితరులు

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పై హత్యాయత్నం కేసు పెట్టాలి

సస్పెండైన కల్లెడ సర్పంచ్ లావణ్య ఆత్మహత్యాయత్నంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని మాజీ ఎంపీలు వి హన్మంత్‌రావు, మధుయాష్కీగౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లావణ్యను వారు పరామర్శించారు. ఆర్మూర్ ప్రాంతంలోని ఇద్దరు సర్పంచ్‌లు చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు రాక ఆత్మహత్యాయత్నం చేసుకుంటే జీవన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌తో మహారాష్ట్ర టూర్లు తిరుగుతున్నారని విమర్శించారు. లావణ్య భర్త ప్రసాద్ గౌడ్‌ను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అక్రమంగా హత్యాయత్నం కేసులో ఇరికించారని ఆరోపించారు. లావణ్య పై ఉన్న సస్పెన్షన్‌ను తొలిగించాలన్నారు. రూ.20 లక్షల బిల్లులు వచ్చేంత వరకు ప్రసాద్‌గౌడ్‌కు అప్పు ఇచ్చిన వారు ఆగాలని కోరారు. సీఎం కేసీఆర్ స్థానిక సంస్థలను నిర్వర్యం చేశారని దీంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఇబ్బందులు పడుతూ రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ప్రసాద్‌గౌడ్‌పై పెట్టిన అక్రమ కేసును సమగ్రంగా విచారించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పీజీ పరీక్షా కేంద్రం తనిఖీ



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ, బీఈడీ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి క్యాంపస్‌లోని పీజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, ఇన్విజిలేటర్లకు సూచించారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించి వర్సిటీకి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. పీజీ, 2వ, 3వ, 4వ, 6వ సెమిస్టర్, బీఈడీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు జరిగినట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు.

పోటీ పరీక్షల పుస్తకాల వివరాలివ్వండి



తెయూ(డిచ్‌పల్లి) : విద్యార్థులు సిద్ధమవుతున్న పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల వివరాలను ఇవ్వాలని తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి వర్సిటీ లైబ్రేరియన్ సత్యనారాయణను ఆదేశించారు. బుధవారం క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీని రిజిస్ట్రార్ సందర్శించారు. లైబ్రరీలో అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా కావాల్సిన కొత్త పుస్తకాల కొనుగోలుకు సంబంధించి ఇండెంట్‌ను వెంటనే తయారు చేయాలన్నారు. వీలైనంత త్వరగా పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని లైబ్రేరియన్‌ను ఆదేశించారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీ వసతులు, అవసరమైన పుస్తకాల గురించి చర్చించారన్నారు. రిజిస్ట్రార్ వెంట చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వివేక్‌రాజ్, విద్యార్థి నాయకులు తదితరులున్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి అభినందన



నిజామాబాద్‌నాగారం : భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన జిల్లాకు చెందిన క్రీడాకారిణి గుగ్లోత్ మమతను సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ హైదరాబాద్‌లో బుధవారం అభినందించారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలో జరగనున్న ఏషియన్ గేమ్స్‌లో భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు జిల్లా క్రీడాకారిణి గుగ్లోత్ మమత ఎంపికైంది. ఈనెల 18 నుంచి 30 వరకు ఢిల్లీలో ప్రత్యేక శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొననుంది. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ రామ లక్ష్మయ్య, నోడల్ స్పోర్ట్స్ ఆఫీసర్ కుమారి, జిల్లా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరజ రెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి గంగా మోహన్ పాల్గొన్నారు.

ఎముకల నూనెకు కేరాఫ్ ఇందూరు

- జిల్లా కేంద్రానికి ఇతర రాష్ట్రాల నుంచి ఎముకల రవాణా
- బహిరంగంగానే నూనె తయారీ
- ప్రజారోగ్యం పట్టని పాలకులు
- ప్రజల ప్రాణాలతో అధికారుల చెలగాటం



బొలెరో నుంచి పడిన పశువుల ఎముకలు (ఫైల్)

ఖలీల్‌వాడి : ఎముకల నూనెకు కేరాఫ్ అడ్రస్‌గా నిజామాబాద్ నిలిచింది. ఎముకలతో దర్జాగా బహిరంగంగా నూనె తయారు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయం. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఎముకల నూనె తయారీని నివారించలేకపోతున్నారు. ఈ నూనె నిజామాబాద్, నిర్మల్, నాందేడ్, హైదరాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి తోపాటు పలు జిల్లాలోని రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లకు సరఫరా చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు నియంత్రించలేకపోతురనే ఆరోపణలున్నాయి.

బాబన్‌సాబ్ పహాడ్, పెయింటర్ కాలనీల్లో..

జిల్లా కేంద్రంలోని బాబన్ సాబ్ పహాడ్, పెయింటర్ కాలనీ వెనుకాల ఎముకల నూనె తయారీ కేంద్రం ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు అక్కడికి వెళ్లేందుకు సాహసించట్లేదు. ఇక్కడ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పశువుల ఎముకలు, వ్యర్థాలను కెమికల్స్ కలిపి వాటిని ఎక్కువసేపు ఉడికించడంతో నూనె తయారీ అవుతుంది. నూనె తయారైన తర్వాత అందులో నుంచి ఎముకలు తీసేసి నూనెలను డబ్బులలో నింపి వాటిని సీల్ వేసి యథాతథంగా షాపులకు పంపిస్తారు. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఎముకలు స్టోరేజ్ చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి..

హైదరాబాద్ తోపాటు ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాందేడ్, ఔరంగబాద్ నుంచి పెద్ద ఎత్తున పశువుల ఎముకలు, వ్యర్థాలు వస్తున్నాయి. గత ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు పశువుల ఎముకలు తీసుకువస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొనడంతో పశువుల ఎముకలు జాతీయ రహదారి 44పై పడిపోయి విపరీతమైన దుర్వాసన వచ్చింది. పోలీసులు బొలెరోతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోని విచారిస్తున్నారు. నిజామాబాద్‌లో ఎముకల నూనె తయారీ చేయడానికి పశువుల వ్యర్థాలను తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. నగర శివారులోని బాబాన్‌సాబ్‌పహాడ్, పేయింటర్ కాలనీ వెనుకల ఎముకల నూనె తయారీ కేంద్రానికి రోజు వాహనాలు వచ్చిపోతున్నా పోలీసులు తనిఖీలు చేసిన సందర్భాలు లేవు. బోల్తాపడ్డ వాహనం ద్వారా పోలీసులు విచారణ జరిపి ఎముకల నూనె తయారీపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజారోగ్యం గాలికి..

మార్కెట్‌లో ఏ వస్తువు క్వాలిటీదో తెలియక తికమక పడుతున్న తరుణంలో తాజాగా జిల్లా కేంద్రంలో ఎముకల నూనె వ్యవహారం బయటకు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏ పదార్థంలో రసాయలతో ఇప్పటికే ప్రజలు అనేక రోగాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. తాజా నూనెల ఏమిటోనంటూ నగరవాసులు తీవ్ర సందిగ్ధంలో పడిపోతున్నారు. రసాయనాలతో తయారీ చేసిన ఎముకల నూనెతో అనేక రోగాలు వస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికే గట్టుచప్పుడు కాకుండానే ఎముకల నూనె మార్కెట్లోకి వచ్చి చేరుతోంది. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎముకల నూనెపై 'సాక్షి'లో కథనం

ఈనెల 5న 'సాక్షి'లో పశువుల ఎముకలతో నూనె అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందులో ఇతర ప్రాంతాల నుంచి ఎముకలను పశువుల వ్యర్థాలు తీసుకొని నూనె తయారీ చేసి హోటళ్లు, మిర్చి బండి, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లకు తరలిస్తున్నట్లు కథనంలో పేర్కొన్నారు. దీనికి తగ్గట్లుగానే డిచ్‌పల్లి మండలంలోని ఏడవ బెటాలియన్ వద్ద బొలెరో వాహనం బోల్తా పడటంతో విషయం తేటతెల్లమైంది. అధికారులు ఎముకల నూనెల తయారీ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసనతో రోగాలపాలు

- సాటాపూర్ అంగడి చెరువులో పశువుల కళేబరాలు
- కిలోమీటర్ వరకు భరించలేని దుర్వాసన
- పర్యవేక్షణ పట్టని పంచాయతీ అధికారులు



అంగడి చెరువులో పశువుల కళేబరాలు

రెంజల్(బోధన్) : పశువుల కళేబరాల దుర్వాసనతో స్థానిక ప్రజలు అల్లాడుతున్నారు. స్వేచ్ఛగా గాలిపీల్చుకునే పరిస్థితి కూడా కరువైందని ఆగ్రహిస్తున్నారు. భరించలేని దుర్వాసన కారణంగా రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామస్తులు రోగాల భారిన పడుతున్నారు. వ్యాపారుల నిర్లక్ష్యం గ్రామస్తుల ప్రాణాలమీదికి వస్తోంది. చెరువు చుట్టుపక్కల రైతులు వాసన భరించలేక నీలా శివారు మీదుగా పంటపొలాలకు రావాల్సి వస్తుంది. ఇదీ రెంజల్ మండలం సాటాపూర్ సమీపంలోని అంగడి చెరువు(ఖజానకుంట) పరిస్థితి. స్థానికంగా పశువుల వ్యాపారం చేసే వ్యక్తులు మృతిచెందిన పశువుల కళేబరాలను అంగడి చెరువులో పడేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో మృత కళేబరాలు ఈ చెరువులో నిత్యం దర్శనమిస్తున్నాయి. ఏడాది పొడవునా ఇదే పరిస్థితి ఉండడంతో స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సంతతో స్థానికులకు చింత..

తెలంగాణలోనే సాటాపూర్ పశువుల సంతకు జిల్లా వ్యాప్తంగా పేరుంది. చుట్టు పక్కల రాష్ట్రాల నుంచి పశువులను ఇక్కడికి తీసుకొచ్చి వ్యాపారులు క్రయ విక్రయాలు చేస్తుంటారు. పశువులను పరిమితికి మించి వాహనాల్లో కుక్కి తీసుకొస్తారు. ఇక్కడికి వచ్చేసరికి కొన్ని పశువులు చావుబతుకల మధ్య ఉంటాయి. వాటిని తక్కువ ధరకు ఇక్కడి వ్యాపారులు కొనుగోలు చేసి వారం, పది రోజులు మేత వేసి మేపుతుంటారు. వాటితో పాటు ఆయా రాష్ట్రాల నుంచి తీసుకొచ్చేటప్పుడు మృతిచెందిన పశువులను తీసుకొచ్చి ఇక్కడి చెరువులో పారేస్తున్నారు. పదేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా స్థానికంగా ప్రజాప్రతినిధులు గాని, అధికారులు గాని పట్టించుకున్న పాపాన పోలేదు. పర్యవేక్షణ చేయాల్సిన నీటి పారుదల శాఖ అధికారులు, సంత ద్వారా ఆదాయం పొందుతున్న పంచాయతీ అధికారులు పర్యవేక్షణ మానేశారు. కిలోమీటరు దూరం వరకు దుర్వాసన వ్యాపిస్తున్నట్లు రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునడంలేదని ఆరోపిస్తున్నారు.

బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం

మృతిచెందిన పశువులను స్థానిక చెరువులో పడేస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ వేయిస్తున్నాం. ఇక నుండి వ్యాపారులు మృత కళేబరాలను చెరువులో పారేస్తే వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

– ఎఖార్ పాషా, సర్పంచ్

విడిపోయిన దంపతులను కలిపిన ఐకేపీ సిబ్బంది



విడిపోయిన భార్యాభర్తలను కలుపుతున్న ఐకేపీ సిబ్బంది, మహిళ సమాఖ్య ప్రతినిధులు

భిక్కనూరు: మండల కేంద్రంలో మనస్పర్థలతో విడివిడిగా ఉంటున్న దంపతులను ఐకేపీ సిబ్బంది కలిపారు. వివరాలిలా ఉన్నాయి. 19 ఏళ్ల కిత్రం మండల కేంద్రానికి చెందిన బాసం యాదగిరి, కాచాపూర్ గ్రామానికి చెందిన లత వివాహం చేసుకున్నారు. వీరికి బీటెక్ చదువుతున్న కుమారుడు, తొమ్మిదో తరగతి చదువుతున్న కూతురు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో ఆరేళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఐకేపీ సిబ్బంది, మహిళా సమాఖ్య ప్రతినిధులు బుధవారం ఇద్దరిని మహిళా సమాఖ్య కార్యాలయానికి పిలిపించారు. ఇరువురి వాదనలు విన్న అనంతరం ఇద్దరినీ సముదాయించారు. పిల్లల భవిష్యత్ కోసం దంపతులు తిరిగి ఒక్కటయ్యారు. కార్యక్రమంలో ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు, ఏపీఎం శ్రీనివాస్, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు అథ్లెటిక్స్‌లో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న జిల్లా కేంద్రంలోని నాగారంలోని రాజారాం స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు సరాల రత్నాకర్, రాజాగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అండర్ – 14, 16, 18, 20, స్త్రీ, పురుషుల విభాగాల్లో క్రీడాకారులకు 600 మీటర్లు, 800, 1500 మీటర్లు, 3,000 మీటర్లలో పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులని ఈనెల 20న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. క్రీడాకారులు రూ. 100 ఎంట్రీఫీతో రిజిస్ట్రేషన్ చేసుకోగలరు. వివరాలకు 99890 40776లో సంప్రదించాలన్నారు.

ఎల్సీడీసీ సర్వే ప్రారంభం



నిజామాబాద్ నాగారం : దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుదర్శన్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రత్యేకంగా దుబ్బ ప్రాంతంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇంటింటికీ సర్వే ద్వారా ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో ఉంటుందన్నారు. అలాగే వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తల ద్వారా కొనసాగుతున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేస్తున్నామన్నారు. అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం 16వ తేదీ నుంచి ఈ నెల 31వ తేదీ వరకు మొత్తం 14 పని దినాల్లో నిర్వహిస్తామన్నారు. సర్వే ద్వారా గుర్తించిన కుష్టి వ్యాధిగ్రస్తులు అందరికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, చికిత్స అందిస్తామన్నారు. నిజామాబాద్ డివిజన్ ఉప వైద్యాధికారిని డాక్టర్ సరిత, సీహెచ్‌వో శశికళ, మధుకర్, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



కామారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రదీప్ యాదవ్

భిక్కనూరు : మండల కేంద్రంలో ఒక యువకుడు బుధవారం ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. భిక్కనూరు పట్టణానికి చెందిన ప్రదీప్ యాదవ్ కుటుంబ సమస్యలతో సతమతమవుతూ జీవితంపై విరక్తి చెంది ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే ప్రదీప్ యాదవ్‌ను కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కామారెడ్డి ఆసుపత్రిలో ప్రదీప్ యాదవ్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

కామారెడ్డి క్రైం : అనారోగ్య కారణాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని ఎస్సీ వాడలో బుధవారం వెలుగు చూసింది. కాలనీకి చెందిన సంగి శ్రీకాంత్ గతంలో హైదరాబాదులో పని చేసేవాడు. అక్కడ మిత్రబిందు (32)అనే మహిళను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అప్పటినుంచి వారు కామారెడ్డిలో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా మిత్రబిందు కడుపు నొప్పితో బాధపడుతుంది. అంతేకాకుండా వారికి ఎనిమిదేళ్లు గడిచినా పిల్లలు కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఈనెల 8న రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎలుకల మందు సేవించింది. ఆమెను మొదట కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి, అనంతరం నిజామాబాద్ జీజీహెచ్‌కు అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మిత్రబిందు మృతి చెందిందని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బీఆర్ఎస్‌ను ఆదరించి ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

బోధన్‌రూరల్(బోధన్) : రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్న బీఆర్ఎస్‌కు రానున్న ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బుధవారం బోధన్ పట్టణ శివారులోని కమ్మ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కమ్మ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్‌లు హాజరయ్యారు. కమ్మ సంఘం భవనంలో కాకతీయ చేయూత చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాన్ని పరిశీలించి వారి సేవలను కొనియాడారు. ప్రతినిధులతో కలిసి భోజనం చేశారు. అనంతరం సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇకపై సెట్లర్ అనే పదం వాడకూడదన్నారు. సీఎం కేసీఆర్ అన్ని కుల సంఘాల భవనాలు కట్టిస్తున్నారన్నారు. కమ్మ సంఘం భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 2 కోట్లు నిధులు ఇస్తానని ఇచ్చిన హామీ మేరకు రూ. 50 లక్షలు ఇచ్చామని, త్వరలో రూ. 1 కోటీ 50లక్షలు అందజేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దన్నారు. ప్రపంచంలో తెలుగువారికీ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత మాజీ సీఎం ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే షకీల్‌ను భారీ మెజారి టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలో బోధన్ నియోజకవర్గం అభివృద్ధికి అన్నివిధాల కృషి చేస్తున్నానన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ బుద్దె సావిత్రి, జెడ్పీటీసీ లక్ష్మీ, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్‌లు శరత్, గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్ బాబు, కమ్మ సంఘం ప్రతినిధులు శ్రీధర్, రవి కిరణ్, శివన్నారాయణ, సుబ్బరావు, రంగారావు, గాంధీ పాల్గొన్నారు.

బోధన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభ సక్సెస్ అయ్యింది. గాయని మధుప్రియ ఆటపాటలతో అలరించారు. పలువురు ఎమ్మెల్సీ కవితను సన్మానించారు.

బోధన్ బహిరంగ సభలో ధూంధాం – సాక్షి ఫొటోగ్రాఫర్ నిజామాబాద్





బోధన్‌లోని బూత్ కమిటీ బహిరంగ సభలో మధుప్రియ గానం, ఎమ్మెల్సీ కవితకు సన్మానం



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

క్రైం కార్నర్

అయ్యప్ప దర్శనానికి వెళ్తూ యువకుడి మృతి



గుండు సాయిరెడ్డి(ఫైల్)

బాల్కొండ : బాల్కొండ మండలం జలాల్‌పూర్‌కు చెందిన గుండు సాయరెడ్డి(39) అయ్యప్ప దర్శనానికి వెళ్తూ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన 12 మంది అయ్యప్ప భక్తులు బస్సులో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వరకు వెళ్లారు. మార్గమధ్యలో తూప్రాన్ వద్ద అల్పాహారం చేసిన తర్వాత ఆ సాయరెడ్డి వాంతులు చేసుకున్నాడు. చెమటలు ఎక్కువగా రాగా గ్యాస్ సమస్య అంటూ సాయిరెడ్డి కొట్టిపారేశాడు. అనంతరం రైలులో వెళ్తుండగా తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆయన తమ్ముడు లక్ష్మణ్ ఆయన బావకు సమాచారమిచ్చాడు. దీంతో చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలు ఆపి 108లో యశోద ఆస్పత్రికి తరలిస్తుండగా మాట్లాడుతూనే ఉన్న సాయరెడ్డి ఒక్కసారి దీర్ఘమైన శ్వాస తీసి ప్రాణాలు వదిలాడు. ప్రతి ఏటా శ్రావణమాసంలో అందరికీ శబరి టికెట్లు బుక్ చేసే వ్యక్తి దైవ దర్శనానికి వెళ్తూనే మృతి చెందడంతో తోటి భక్తులు ఆవేదన చెందారు. మృతుడికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని..



అంకం నేహశ్రీ (ఫైల్)

రాజంపేట : అనారోగ్యంతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన రాజంపేట మండలం ఆరెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన అంకం శ్యాంకరావ్, భారతి కూతురు నేహశ్రీ(19) బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. అనారోగ్య కారణంగా ఇటీవల ఇంటికి వచ్చింది. తెల్లపసిరికలని వైద్యులు తెలపడంతో కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమె తల్లిదండ్రులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించగా మెరుగైన చికిత్స కోసం నేహశ్రీని మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి తమ్ముడు, చెల్లె ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఖలీల్‌వాడి : నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సల్తార్ రవి మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సల్తార్ రవి భార్య గోదావరి మధ్య తరుచూ గొడవలు జరిగేవన్నారు. బుధవారం ఉదయం భార్యాభర్తలకు గొడవ జరిగి భార్య పుట్టింటికీ వెళ్లగా మద్యంలో పురుగుల మందు తాగి ఇంట్లో పడిపోయాడు. స్థానికులు గమనించి అతడిని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

బైక్ చోరీ చేసిన వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలో బైక్ చోరీ చేసిన వ్యక్తిని పట్టుకుని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన కిరణ్ గతనెల 31న డైలీ మార్కెట్‌లో బైక్ నిలువగా కొద్దిసేపటికి బైక్ చోరీకి గురైంది. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బుధవారం ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి బైక్‌పై పారిపోతున్న కుర్మ రాజశేఖర్‌ను(26)ను ప్రశ్నించగా బైక్ చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. రాజశేఖర్ వద్ద నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ముగ్గురికి..

లింగంపేట(ఎల్లారెడ్డి) : వేర్వేరు కేసుల్లో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎక్కపల్లి గ్రామానికి చెందిన దూషన్నగారి శివకుమార్, అదే గ్రామానికి చెందిన శంకరి రామకృష్ణను ఎక్కపల్లి శివారులో అక్రమంగా అటవీ భూమిలో చెట్లు, పొదలు నరికివేసి భూమిని సాగుచేయడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. అలాగే పోలీసు వాహనాలను ధ్వంసం చేసిన సంఘటనలో వీరిని రిమాండు చేసినట్లు ఎస్సై తెలిపారు. మరో కేసులో శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన బిట్ల ప్రశాంత్ ఎయిర్‌గన్‌తో అదే గ్రామానికి చెందిన బోధనపు రాజుపై కాల్పులు జరిపినట్లు తెలిపారు. గాయపడిన రాజు హైదరాబాదులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. రాజు ప్రాణాపాయం నుంచి బయటపడ్డట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటనలో ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కలుషిత ఆహారం తిని మూడు గేదెలు మృతి



మృతి చెందిన గేదె

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి పట్టణంలోని గుమస్తా కాలనీ సమీపంలో కొంతమంది వ్యక్తులు పారబోసిన కలుషిత ఆహారం తిని మూడు గేదెలు మృతి చెందినట్లు రైతులు తెలిపారు. అడ్లూరు గ్రామానికి చెందిన గడ్డమీది సంజీవ్, ముదాం మహేష్, పెరుమాండ్ల లింగంకు చెందిన మూడు పశువులు రోజు మాదిరిగా మేతకు వెళ్లాయి. శాబ్దిపూర్ రోడ్డు సమీపంలోని బైపాస్ రోడ్డు పక్కన ఉన్న వెంచర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ లారీలో మిగిలిపోయిన యూరియా, బియ్యం వ్యర్థాలు పారబోయడంతో వాటిని తిన్న గేదెల్లో రెండు అక్కడికక్కడే మృతి చెందగా ఒక గేదె చికిత్స పొందుతూ మృతి చెందింది. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగినట్లు వారు పేర్కొన్నారు.


యువకుడిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్ రూరల్) : మండలంలోని ముదక్‌పల్లికి చెందిన నీరడి రాణిని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్న నవీపేట్ మండలం మహంతంకు చెందిన దినేశ్‌పై కేసు నమోదైనట్లు ఎస్సై రాము బుధవారం తెలిపారు. రాణి నర్సింగ్ కళాశాలలో చదువుతుంది. ఇరువురు వరుసకు బావ మరదళ్లు. కొంతకాలంగా ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని రాణిపై ఒత్తి డి చేస్తున్నాడు. ఈక్రమంలో 14న ముదక్ పల్లిలో ఆ మె ఇంటి వద్ద గొడవ చేశాడు. రాణి, దినేష్ పురుగు ల మందు తాగినట్లు తెలిసింది. ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్య

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రానికి చెందిన బర్ల సునీత(35) బుధవారం ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై మురళి తెలిపారు. జుక్కల్ మండలం మహ్మదాబాద్‌లో గ్రామానికి చెందిన బోయి గణేశ్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య నిత్యం చిన్నచిన్న గొడవలు జరుగుతుండగా మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



దోమకొండలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసులు

దోమకొండ : మండల కేంద్రానికి చెందిన వాసవి రైస్‌మిల్‌లో బుధవారం దాడులు నిర్వహించి 8.80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి దాడులు చేశామన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం పట్టుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించామన్నారు. సదరు రైస్‌మిల్ యజమాని ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. రైస్‌మిల్లుల్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం అమ్మితే అలాంటి వారి సమాచారం పోలీసులకు అందించాలని, వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.